క్లుప్తంగా

అప్పన్నకు విశేషంగా స్వర్ణపుష్పార్చన



స్వామికి స్వర్ణపుష్పాలతో పూజ నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం స్వర్ణపుష్పార్చన విశేషంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్టింపజేశారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శతనామావళిపూజ నిర్వహించారు. విశేషంగా హారతి అందజేశారు. ఉభయదాతలకు స్వామి వారి శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



వృద్ధులకు అన్నం వడ్డిస్తున్న గండి రవికుమార్

పెందుర్తి: స్థానిక లయోలా వృద్ధాశ్రమంలోని వృద్ధులకు సబ్బవరం మండలం బోదువలస సర్పంచ్ నేబర్తి శ్రీనివాసరావు ఆదివారం భోజనం సమకూర్చారు. వైఎస్సార్‌సీపీ నేత గండి రవికుమార్ చేతుల మీదుగా వృద్ధులకు ఆహారం అందించారు. వృద్ధాశ్రమానికి తన వంతుగా మరిన్ని సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు సర్పంచ్ శ్రీనివాసరావు భరోసానిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సబ్బవరం మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు, మొగలిపురం ఉపసర్పంచ్ సిరపరపు వాసు, నాయకులు బత్తిన వెంకట్, నేబర్తి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గణపతికి పంచామృతాభిషేకం



పూజలందుకున్న గణపతి

పెందుర్తి: సంకటహర చతుర్థిని పురస్కరించుకుని స్థానిక వేంకటాద్రి క్షేత్రంలో కొలువుదీరిన గణపతి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా గణపతికి పంచామృతాభిషేకాలు జరిపారు. అనంతరం అర్చనలు గావించారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



రాంపురంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న త్రైత సిద్ధాంత ప్రబోధ సమితి ప్రతినిధులు

పెందుర్తి: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పెందుర్తి మండలం రాంపురం, పెదగాడి గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఆదివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. సమితి ప్రతినిధులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కె.త్రినాథరావు, జి.కృష్ణ, సూరప్పడు, ఎస్.సూర్యనారాయణ, ఎస్.అచ్చమ్మ, బి.అంకమ్మ, సంతోష్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు షాపులు కావలెను!

గాజువాక: మద్యం షాపుల ఏర్పాటు చేయడానికి అద్దె భవనాల కోసం వ్యాపారులు వెతుకులాట ప్రారంభించారు. నూతన మద్యం పాలసీ అమలైన నేపథ్యంలో ప్రభుత్వం కొత్త మద్యం దుకాణాలు కేటాయించింది. ఇప్పటికే కొన్ని దుకాణాలు ఏర్పాటయ్యాయి. మరిన్ని దుకాణాలకు మద్యం వ్యాపారులు అద్దె భవనాల కోసం వేట ప్రారంభించారు. గాజువాక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఇప్పటికే 20 దుకాణాలు ఏర్పాటు చేసినట్టు సమాచారం. గాజువాక, పారిశ్రామిక ప్రాంతంలో మొత్తం 50 దుకాణాల ఏర్పాటుకు అవకాశం ఉందని ఎక్సైజ్ అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం ప్రొవిజనల్ అనుమతులపై మద్యం దుకాణాలు ఏర్పాటైన విషయం తెలిసిందే. ఆయా దుకాణాలకు పూర్తి స్థాయిలో అనుమతులు ఇచ్చిన తర్వాత కొత్త దుకాణాలపై కూడా స్పష్టత వస్తుందని అధికారులు పేర్కొంటున్నారు.

జెర్రిపోతులపాలెం సర్పంచ్ కబ్జా పర్వం

- ప్రభుత్వ, డీ–ఫారం భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్న సర్పంచ్
- అధికారులను బెదిరించి నడి రోడ్డుపై వాణిజ్య సముదాయాలు
- మాజీ సర్పంచ్‌తో సంయుక్తంగా అక్రమ నిర్మాణాలు



జెర్రిపోతులపాలెంలో ప్రభుత్వ స్థలంలో సర్పంచ్ నిర్మిస్తున్న అక్రమ నిర్మాణం



జెర్రిపోతుపాలెంలో మాజీ సర్పంచ్ నిర్మిస్తున్న అక్రమ నిర్మాణం

పెందుర్తి: అధికారం ఉంది.. అండగా సర్పంచ్ అనే పదవి ఉండనే ఉంది.. ఇంకేముంది.. ప్రభుత్వ స్థలమైనా అది మనదే అన్నట్లు ఉంది ఆ సర్పంచ్ తీరు. అతడికి మాజీ సర్పంచ్ కూడా జత కలిశాడు. ఇంకేముంది ఇద్దరూ కలిసి ప్రభుత్వ, డీ-ఫారం భూములను చెరబట్టి దురాక్రమణకు పాల్పడ్డారు. ఏకంగా రెవెన్యూ అధికారులను అధికార మదంతో బెదిరించి నిర్మాణాలు కూడా చేపట్టారు. అధికారంలోకి వచ్చిన తరువాత కూటమి నాయకుల అక్రమాల పర్వానికి పరాకాష్టగా నిలిచిన వ్యవహారం ఇది. పెందుర్తి మండలం జెర్రిపోతులపాలెంలో టీడీపీ సానుభూతి సర్పంచ్ మడక అప్పలరాజు ప్రభుత్వ భూమిని చెరబట్టి నిర్మాణాలు చేపట్టారు. అతడితో పాటు టీడీపీ సానుభూతి మాజీ సర్పంచ్ వడిశల శ్రీను కూడా గ్రామంలోని ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు అందాయి.

అప్పుడు ఆక్రమణ.. ఇప్పుడు నిర్మాణాలు

పంచాయతీ సర్పంచ్ అంటే ఆదాయాన్ని సమకూర్చి పంచాయతీని అభివృద్ధి పథంలో నిలపాలి. కానీ జెర్రిపోతుపాలెంలో సర్పంచ్ అప్పలరాజు తీరు అందుకు భిన్నంగా ఉంది. నాలుగు నెలల క్రితం టీడీపీ–జనసేన కూటమి అధికారంలోనికి వచ్చాక సర్పంచ్ అనే విషయాన్ని మర్చిపోయి గతంలో(2014–19) టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు చెరబట్టిన భూములను హస్తగతం చేసుకునేందుకు సిద్ధమయ్యారు. అతనికి ఐదేళ్ల పాటు సర్పంచ్‌గా పనిచేసిన వడిశల శ్రీను జతకలిశాడు. ఇంకేముంది గ్రామంలోని సర్వే నెంబర్ 79–3, 4, సర్వే నెంబర్ 80–1 లోని ప్రభుత్వ భూమితో పాటు డి.ఫారం స్థలాన్ని కూడా ఆక్రమించారు. అందులో ప్రస్తుతం వాణిజ్య సముదాయాలు నిర్మిస్తున్నారు.

ఎవరు ఆపుతారో చూస్తాం..

పై సర్వే నెంబర్లలోని భూములను ఆక్రమించుకుని నిర్మాణాలు చేపడుతున్నా రెవెన్యూ అధికారులు స్పందించలేని పరిస్థితి. అంతా తెలిసినా అధికార పార్టీ ప్రజాప్రతినిధి అన్న కారణంగా కనీసం అటువైపు కన్నెత్తి చూడడం లేదు. ఒకవేళ రెవెన్యూ అధికారులు ఆయా నిర్మాణాలను అడ్డుకునేందుకు ప్రయత్నం చేసినా కూటమి 'ముఖ్య' నాయకులతో ఫోన్ల ద్వారా బెదిరింపులకు దిగుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఈ ఆక్రమణల పర్వంపై జిల్లా రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు వెళ్లినా ఇప్పటి వరకు చర్యలు లేకపోవడం గమనార్హం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణలపై తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సిబ్బందిని పంపించి పరిశీలిస్తాం



జెర్రిపోతుపాలెంలో ప్రభుత్వ భూములు ఆక్రమించినట్లు మా దృష్టికి రాలేదు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం. మా సిబ్బందిని సోమవారం సదరు భూమి వద్దకు పంపి పరిశీలిస్తాం. ఆక్రమణలు నిజమైతే తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

– ఆనంద్‌కుమార్, తహసీల్దార్, పెందుర్తి

రాళ్లు తేలిన రోడ్లు.. నరకంగా ప్రయాణాలు



రాళ్లు తేలిన వెంకటాపురం రహదారి



గుంతలతో నిండిన మండల కాంప్లెక్సు కూడలి

పరవాడ: మండల పరిధి వాడచీపురుపల్లి శివారు వెంకటాపురం రహదారి అధ్వాన్నంగా మారింది. పాలకులు పట్టించుకోకపోవడంతో ప్రయాణికులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. వాడచీపురుపల్లి నుంచి సుమారు 2 కిలోమీటర్ల నిడివి కలిగిన ఈ రహదారి చాలా కాలం నుంచి మరమ్మతులకు నోచుకోలేదు. ఫలితంగా కూరగాయలు పండించే రైతులు, వ్యాపారులు, విద్యార్థులు నిత్యం రాళ్లు తేలిన రహదారితో అష్టకష్టాలు పడుతున్నారు. రహదారులు అద్దంలా తయారు చేస్తామని కూటమి నేతలు ఇచ్చిన హామీలు అమలుకు కనీస చర్యలు కూడా లేవు. తాత్కాలిక మరమ్మతులు చేపట్టినా చాలని పరిసర గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు. ఇటీవలి భారీ వర్షాలకు రాళ్లు తేలిన రోడ్డులో మోకాలి లోతు గోతులు ఏర్పడ్డాయి. ప్రస్తుతం ఏ చిన్నపాటి వర్షం కురిసినా రోడ్డులో ప్రయాణం నరకంలా మారుతోందని ప్రయాణికులు వాపోతున్నారు. భారీ గుంతలతో పడరాని పాట్లు పడుతున్నామని నునపర్తి, వెంకటాపురం గ్రామాలకు చెందిన వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికుల అవస్థలను గుర్తించి రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

- పరవాడ మండల కాంప్లెక్సు కూడలిలో ఏర్పడిన భారీ గుంతలతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూడలి మలుపులో ఏర్పడిన గోతుల కారణంగా భారీ వాహనాలు మలుపు తిరిగే సమయంలో పల్టీలు కొడుతున్నాయి. చీకటి పడితే గుంతలు కనిపించక ద్విచక్ర వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. గత కొంత కాలం నుంచి కూడలిలో ఏర్పడిన గుంతలు ప్రయాణికులను ముప్పుతిప్పలు పెడుతున్నా అధికారులు కనీస చర్యలు తీసుకోకపోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హౌసింగ్ ఏఈ బాధ్యతల స్వీకరణ



రామచంద్రరావు

పరవాడ: పరవాడ గృహ నిర్మాణశాఖ ఏఈగా ఐ.రామచంద్రరావు బాధ్యతలు స్వీకరించారు. ఈయన బుచ్చెయ్యపేట హౌసింగ్ ఏఈగా పనిచేసి బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో పరవాడలో హౌసింగ్ ఏఈగా పనిచేసిన ఎంఎస్ఎన్ రెడ్డి సబ్బవరం బదిలీ అయ్యారు.

అవయవదాతల సంఘం కన్వీనర్‌గా శ్రీనివాస్



గూడూరు సీతామహలక్ష్మి నుంచి నియామకపత్రం అందుకుంటున్న శ్రీనివాస్

పెందుర్తి: రాష్ట్ర శరీర, అవయవ దాతల సంఘం పెందుర్తి జోన్ కన్వీనర్‌గా పెందుర్తికి చెందిన సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు దాడి శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ గూడూరు సీతామహలక్ష్మి చేతుల మీదుగా ఆదివారం నియామక పత్రం అందుకున్నారు.

కూటమి ప్రభుత్వంలో నిత్యావసరాల ధరకు రెక్కలు



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి పైడిరాజు

పెదగంట్యాడ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఒక్కసారిగా నిత్యావసర సరకులు, కూరగాయల ధరలు పెరగడంతో సామాన్యులు , మధ్యతరగతి ప్రజలు ఏం కొనలేక, తినలేక అవస్థలు పడుతున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం పైడిరాజు అన్నారు. పెదగంట్యాడలోని పోతిన సన్యాసిరావు భవనంలో ఆదివారం సీపీఐ నియోజకవర్గ సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేద ప్రజలు నిత్యావసర సరకులు, కూరగాయలు కొనలేకపోతున్నారని... పెరిగిన ధరలను నియంత్రించకుండా కూటమి నాయకులు మా ప్రభుత్వం మంచి ప్రభుత్వం అని చెప్పుకుంటూ తిరుగుతున్నారని మండిపడ్డారు. దళారులు నిత్యావసరాలు, కూరగాయల ధరలను పెరుగుదలను శాసిస్తున్నారని తక్షణమే దళారి వ్యవస్థలను కట్టడి చేయాలని డిమాండ్ చేశారు. ఉచిత ఇసుక ప్రకటనలకే పరిమితమైందని ఎద్దేవా చేశారు. ఆన్‌లైన్ దరఖాస్తు విధానం లోపభూయిష్టంగా ఉందన్నారు.ఇసుక అందుబాటులో లేక లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికులు ఉపాధి లేకుండా పస్తులుండే పరిస్థితి ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చాలని లేని పక్షంలో ఉద్యమం ద్వారా ప్రజల్లోకి వెళ్తామని హెచ్చరించారు.

ప్రజాహితాన్ని కోరే సంస్థలకు గుర్తింపు



ఉచిత కంప్యూటర్ శిక్షణకు ఎంపికైన వారికి పత్రాలు అందిస్తున్న అతిథులు

అగనంపూడి: ప్రజాహితం కోసం పని చేసే సంస్థలకు గుర్తింపు లభిస్తుందని విశాఖ ఉక్కు విశ్రాంత జనరల్ మేనేజర్ దువ్వాడ రామ ప్రసాద్ అన్నారు. అగనంపూడి సీడబ్ల్యూసీలో ప్రేరణ అసోసియేషన్ ఫర్ సోషల్ సర్వీస్ స్వచ్ఛంద సంస్థ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా చేపడుతున్న సేవా కార్యక్రమాలకు ప్రజల్లో గుర్తింపు ఉంటుందన్నారు. ప్రేరణ సంస్థ వ్యవస్థాపకుడు బాల బొమ్మల శ్రీనివాసరావు మాట్లాడుతూ అసోసియేషన్ ద్వారా పేద విద్యార్థులకు ఉచితంగా కంప్యూటర్ శిక్షణ ఇస్తామన్నారు. ఉక్కు విశ్రాంత డీజీఎం కె.వి.రామారావు, బ్రహ్మకుమారీస్ అగనంపూడి ఇన్‌చార్జి బీకే రామకోటి, ప్రజా సంఘాల ప్రతినిధులు సుశీలా గజేంద్రరావు, బలిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అవకాశాల కల్పనే కళాకారులకు నిజమైన ప్రోత్సాహం

గాయకుడు గజల్ శ్రీనివాస్



గజల్ శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న వైజాగ్ బీట్స్ సంస్థ వ్యవస్థాపకురాలు శారద తదితరులు

ఎంవీపీకాలనీ: ప్రతిభకు అనుగుణంగా సినిమా, ఇతర రంగాల్లో అవకాశాలు కల్పించడమే కళాకారులకు నిజమైన ప్రోత్సాహమని గాయకుడు గజల్ శ్రీనివాస్ అన్నారు. సినీ గాయకుల వేదిక వైజాగ్ బీట్స్ సంస్థ 8వ వార్షికోత్సవం ఆదివారం ఎంవీపీ కాలనీ బీచ్ రోడ్డులోని గాదిరాజు ప్యాలెస్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాయకుల సత్కార వేడుకలో గజల్ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా మాట్లాడారు. కళా నైపుణ్యం ఉన్న వారికి ప్రస్తుతం అవకాశాలు కోకొల్లలుగా ఉన్నాయన్నారు. వారి ప్రతిభను సమాజానికి తెలియజేసేలా అవకాశం ఉన్న ప్రతి వేదికపైనా సత్తా చాటాలన్నారు. కొత్త కళాకారులకు సినీ రంగ ప్రముఖులు అవకాశాలు కల్పించాలని కోరారు. వైజాగ్ బీట్స్ గాయకులు అద్భుతంగా వారి సంగీత నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారన్నారు. సినిమా డైరెక్టర్ పీసీ ఆదిత్య కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైజాగ్ బీట్స్ తరపున హెచ్ఐవీ బాలలను సంరక్షిస్తున్న డిజైర్ సొసైటీ నిర్వాహకుడు లక్ష్మణ్‌కు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. గజల్ శ్రీనివాస్‌తోపాటు డైరెక్టర్ పీసీ ఆదిత్యను సంస్థ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. గాయకులు అతిథుల చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందుకున్నారు. వైజాగ్ బీట్స్ వ్యవస్థాపకురాలు డి.శారద, ఉమ్మడి విశాఖ జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన సంస్థ సభ్యులైన గాయనీ గాయకులు పాల్గొన్నారు.

సీజ్ చేసిన వాహనాల బహిరంగ వేలం 23న

అనకాపల్లి: జిల్లా ఆర్టీవో కార్యాలయ పరిధిలో రవాణాశాఖ అధికారులు వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో సీజ్‌చేసిన వాహనాలకు ఈనెల 23న బహిరంగ వేలం నిర్వహించనున్నారు. స్థానిక జీవీఎంసీ విలీన గ్రామమైన కొప్పాక ఆర్టీవో కార్యాలయం వద్ద మధ్యాహ్నం 3 గంటలకు ఐదు గూడ్స్ వాహనాలు, ఒక మాక్సీక్యాబ్‌ను వేలం వేయను న్నట్టు ఆర్టీవో జి.మనోహర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సీజ్‌చేసిన వాహనాల యజమానులకు నోటీసులు జారీ చేసినప్పటికీ స్పందించలేదని, వారితో పాటు ఫైనాన్షియర్లు కూడా స్పందించకపోవడంతో బహిరంగ వేలం వేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గల వారు నేరుగా కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

తీరంలో కేరింతలు



తిక్కవానిపాలెం తీరంలో జలకాలాడుతున్న సందర్శకులు

పరవాడ: తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం తీర ప్రాంతాలు ఆదివారం సందర్శకులతో కళకళలాడాయి. మండుతున్న ఎండలకు తీర ప్రాంతాల్లో సేదదీరేందుకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి సందర్శకులు అధిక సంఖ్యలో తరలిరావడంతో తీర ప్రాంతాల్లో సందడి నెలకొంది. అనకాపల్లి, గాజువాక, సబ్బవరం , పరవాడ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు తీర ప్రాంతాల్లో ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. సముద్ర స్నానాలు చేసి, కేరింతలు కొట్టారు. సాయంత్రం వరకు తీరంలో గడిపి, ఆనందంగా తిరుగుముఖం పట్టారు.

జోరుమీదున్న జూదగాళ్లు

- శివారు ప్రాంతాల్లో కోడి పందాలు, పేకాట శిబిరాలు
- తోటలు, నిర్మానుష్య ప్రాంతాలే నిర్వహణ కేంద్రాలు
- అంతా కూటమి నేతల కనుసన్నల్లోనే..
- చోద్యం చూస్తున్న పోలీసులు



పెందుర్తి పోలీసులు స్వాధీనం చేసుకున్న పందెం కోళ్లు(ఫైల్)

పెందుర్తి: పండగల వేళ శివారు ప్రాంతాల్లో కోడి పందాల జోరు కొనసాగుతోంది. తోటలు, చెరువు గట్ల దిగువ, నిర్మానుష్య ప్రాంతాల్లో గుట్టు చప్పుడు కానీయకుండా పందాలు నిర్వహిస్తున్నారు. ఓ వైపు కోడి పందాలు, మరోవైపు పేకాట శిబిరాలు జోరుగా సాగుతున్నాయి. ప్రధానంగా వారాంతపు రోజుల్లో కోళ్ల కాలు దువ్వుతున్నాయి. పెందుర్తి, సబ్బవరం, పరవాడ శివారు ప్రాంతాల్లోని తోటలు వేదికగా శని, ఆదివారాల్లో జోరుగా పందాలు వేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో పందాలపై నియంత్రణ ఉండేది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులు, నాయకుల అండ చూసుకుని జూదగాళ్లు రెచ్చిపోతున్నారు.

జూదానికి చాలా అనుకూలం

నియోజకవర్గ పరిధిలో తోటలు అధికం. పెందుర్తి, అక్కిరెడ్డిపాలెం, నరవ, జెర్రిపోతులపాలెం, సతివానిపాలెం, చినముషిడివాడ వుడా కాలనీ, సబ్బవరం, పరవాడ తదితర ప్రాంతాల్లో వందల ఎకరాల్లో జీడిమామిడి, మామిడి, సరుగుడు తోటలు విస్తారంగా ఉన్నాయి. ఇవి చాలావరకు పేకాట, కోడిపందాలకు అనుకూలంగా ఉన్నాయి. వీటితో పాటు అపార్ట్‌మెంట్ ఫ్లాట్లు కూడా పేకాటకు అనుకూలంగా మారాయి. ఆయా ప్రాంతాలే పందెంరాయుళ్లకు స్థావరాలు. ప్రత్యేకంగా కొందరు వ్యక్తులతో కూడిన గ్రూపులు ఈ డెన్‌లను నడిస్తున్నాయి. వీరు ఆటకు ఇంత అని నిర్ధారించి ఆటగాళ్లదగ్గర వసూలు చేస్తుంటారు. ఆటగాళ్లకు మద్యం, ఇతర త్రా సౌకర్యాలు కల్పిస్తుంటారు. ఆటలో పందాలు రూ.లక్షల్లోనే ఉన్నట్లు సమాచారం. పెరిగిన సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకుని స్మార్ట్ ఫోన్ల ద్వారా అక్కడికక్కడే ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్‌లు చేసుకుంటున్నారు. మరికొంత మంది భూములు, వాహనాల పత్రాలు ష్యూరిటీగా పెట్టి పందాలు కాస్తున్నారు.

కింది స్థాయి సిబ్బంది కనుసన్నల్లోనే!

జూదాన్ని నియంత్రించాల్సిన పోలీసులే చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జూదరులు బరి తెగించడం గమనార్హం. కోడి పందాలు, పేకాట శిబిరాల గురించి కిందిస్థాయి పోలీస్ సిబ్బందికి తెలిసినా వారిని 'మామూళ్ల'గా స్థానిక కూటమి నాయకులు సర్దిచెప్పుకుంటున్నారన్న ప్రచారం జరుగుతోంది. గతంతో పోల్చితే నియోజకవర్గంలో ఇలాంటి శిబిరాలపై పోలీసుల దాడులు లేకపోవడం ఆరోపణలకు బలం చేకూర్చుతోంది.

కఠినంగా వ్యవహరిస్తాం

జూదం, కోడిపందాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు పూర్తిగా నిషిద్ధం. ఆయా అంశాలపై కఠినంగా వ్యవహరిస్తాం. పందాలు నిర్వహించేవారు ఎంతటివారైనా వదిలిపెట్టం. ఇతర నేరాలపై కూడా మా సిబ్బందిని అప్రమత్తం చేశాం. ప్రజలు కూడా ఇటువంటి వాటిపై మాకు సమాచారం ఇచ్చి సహకరించాలి. 94407 96039, 0891–2764233 ఫోన్ నంబర్ల ద్వారా మమ్మల్ని సంప్రదించవచ్చు.

– కె.వి.సతీష్‌కుమార్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, పెందుర్తి

కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి



హెచ్‌బీ కాలనీలో పాడైన రోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు పురుషోత్తపురంలోని హెచ్‌బీ కాలనీలో సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ ముమ్మన దేముడు అన్నారు. ఆదివారం కాలనీలో క్షేత్రస్థాయి పర్యటన జరిపారు. స్థానికులు కాలనీలోని సమస్యలను వివరించారు. ముఖ్యంగా కాలనీ ప్రధాన మార్గంలో కూలిపోయిన కల్వర్టుతో పాటు రోడ్డును బాగుచేయాలని కోరారు. దీనికి స్పందించిన దేముడు రోడ్డు సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు కృషి చేస్తానన్నారు. కాలనీ ప్రతినిధులు వి.రామకృష్ణ, ఎం.సత్యనారాయణ, హెచ్.జోగారావు పాల్గొన్నారు.

బాలలచే భిక్షాటన చట్టరీత్యా నేరం




ప్లకార్డులతో అవగాహన కల్పిస్తున్న జనరేషన్ యువ ప్రతినిధులు, విద్యార్థులు

సబ్బవరం: బాలలచే భిక్షాటన చేయించడం చట్టరీత్యా నేరమని, అలాంటి వారిని ప్రోత్సహించవద్దని జనరేషన్ యువ సబ్బవరం కో ఆర్డినేటర్ బిపిన్ పాల్ అన్నారు. స్థానిక మూడు రోడ్ల కూడలిలో జనరేషన్ యువ ఆధ్వర్యంలో విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీనిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ కాంప్లెక్స్‌లు, ఆటో స్టాండ్‌లు, రైల్వే స్టేషన్ల వంటి ప్రధాన కూడళ్లలో చిన్నారులు భిక్షాటన చేస్తూ కనిపిస్తారని, అలాంటి వారి సమాచారాన్ని తమకు అందించాలన్నారు. వారికి ఉచిత వసతితో పాటు మంచి విద్యను అందించి ప్రయోజకులుగా తీర్చిదిద్దే బాధ్యత తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో విద్యార్థులతో కలిసి నినాదాలు చేస్తూ స్థానికులకు అవగాహన కల్పించారు.

సత్యసాయి అవతార వైభవం



మహా నగర సంకీర్తనను ప్రారంభిస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు



విద్యుద్దీప కాంతుల్లో సత్యసాయి ప్రేమసదన్

బీచ్‌రోడ్డు: భగవాన్ శ్రీ సత్యసాయిబాబా దివ్య అవతార ప్రకటన దినోత్సవం సందర్భంగా ఆదివారం సిటీ సత్యసాయి సమితి ఆధ్వర్యంలో మహా నగర సంకీర్తన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. పెదవాల్తేరులోని కరకచెట్టు పోలమాంబ అమ్మవారి దేవాలయ ప్రాంగణంలో ప్రత్యేక భజన చేసి అక్కడ నుంచి సంకీర్తన ప్రారంభించారు. పెదవాల్తేరు, శాంతి ఆశ్రమం, లాసన్స్ బే కాలనీ, ఉషోదయ జంక్షన్ మీదుగా ప్రేమ సదన్ మందిరానికి సంకీర్తన ఊరేగింపు చేరుకుంది. ఈ సందర్భంగా శ్రీ సత్యసాయి సేవా సమితి కన్వీనర్ డి.వి.వి.సీతారామరాజు మాట్లాడుతూ బాబా 14 ఏళ్ల వయసులో భక్తుల కోసం వెళ్లాలని చెప్పి ఇంటి నుంచి వచ్చిన రోజును దివ్య అవతార ప్రకటన రోజుగా జరుపుతున్నామన్నారు. నవంబర్ రెండో శనివారం నాడు ప్రపంచ వ్యాప్తంగా ఒకేసారి 24 గంటల నామస్మరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మహా క్రతువులో భక్తులందరూ పాల్గొని, విజయవంతం చేయాల్సిందిగా కోరారు. సంకీర్తనల అనంతరం సత్యసాయి భక్తులకు అల్పాహార ప్రసాదం అందజేశారు.

సుందరంగా ప్రేమసదన్

శ్రీ సత్యసాయిబాబా అవతార ప్రకటన దినోత్సవం సందర్భంగా ఎంవీపీ కాలనీ సెక్టార్–8లోని సత్యసాయి ప్రేమసదన్‌ను విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. ప్రేమసదన్‌లో సత్యసాయికి వింజామర సేవ, మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించారు. మహా నగర సంకీర్తన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించామని శ్రీ సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు పీఆర్ఎస్ఎన్ నాయుడు తెలిపారు.